

జిల్లాలో నేడు

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి
ఇంటర్వ్యూలు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి23(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నేడు(సోమవారం) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎంహెచ్‌ఎం పథకం కింద మల్టిజోన్-2 పరిధిలో 8 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇది వర్తించనుందన్నారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి టీఎస్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని ఉండాలన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల వయస్సున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఉమెన్‌లకు 5 సంవత్సరాలు, శారీరక వైకల్యంతో బాధపడే వారికి 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు ఫొటోను జత చేసి కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె సూచించారు.

కొడంగల్‌లో
వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి మూల విరాట్

కొడంగల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి(24వ తేదీ) నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న స్వామివారి కోవిలాళ్వార్ల తిరుమంజనం, 25న సేనాధిపతి ఉత్సవం, 26న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేషవాహనం, 28న సింహవాహనం, వ్యాళి వాహనం, 29న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, అమావాస్య పూలంగి సేవ, 30న మోహిని అవతార ఉత్సవం, ఉగాది ఆస్థానము, పంచాంగ శ్రవణం, రాత్రి గరుడోత్సవము(లంకా దహనము), స్వామివారికి టీటీడీ శేషవస్త్రాల సమర్పణ, ఏప్రిల్ 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 2న రథోత్సవం, అశ్వ వాహనం, వీధి ఉత్సవం, 3న పల్లకీ సేవ, చక్రస్నానం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల్లో సంస్కరణలు చేపట్టింది. ఏప్రిల్ నుంచి పట్టణ ప్రాంతాల్లోని మెప్మా, సెర్ప్ కింద కొనసాగుతున్న గ్రామీణ ప్రాంత మహిళా సంఘాలన్నీ ఒకే గొడుగుకిందకు రానున్నాయి. త్వరలోనే ఈ మార్పులు జరగనున్నట్లు మెప్మా, సెర్ప్ విభాగాల అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది. 'ఇందిరా మహిళా శక్తి పాలసీ-2025'కి ఇప్పటికే మంత్రి వర్గం ఆమోద ముద్ర పడిన విషయం తెలిసిందే.



మహిళా శక్తి.. మరింత బలోపేతం!

విలీనం కానున్న సెర్ప్, మెప్మా విభాగాలు

మహిళా సంఘాల్లో పలు సంస్కరణలు

రిటైర్మెంట్ వయస్సు పెంపు.. చేరికకు తగ్గింపు

ఏప్రిల్ నుంచి 'ఇందిరా మహిళా శక్తి-25' పాలసీ అమలు

జిల్లాలోని మహిళా సంఘాల వివరాలు

	సంఘాలు	సభ్యులు
మెప్మా	2,600	26,000
సెర్ప్	16,046	1,63,574
మొత్తం	18,646	1,89,574

ఒకే గొడుగు కిందకు మహిళా సంఘాలు



తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పాలసీ-2025 మహిళా సంఘాలకు కొత్తదారి చూపనుంది. మహిళలకు భద్రత, అభివృద్ధి పేరిట ఈ పాలసీని అమల్లోకి తీసుకురానున్నారు. ఈ పాలసీలో భాగంగా గ్రామీణ, పట్టణ మహిళలకు సమాన అవకాశాలు కల్పించనున్నారు. కిశోర బాలికలను ఆర్థికాభివృద్ధి దిశగా ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతను పెంపొందించనున్నారు. అలాగే మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగడం, నాయకత్వ నైపుణ్యాలను పెంచి కోటీశ్వరులను చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీని అమలు చేయనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడం, సంఘాల సంఖ్యను పెంచడం కోసం గతంలోని అర్హత నిబంధనలలో రాష్ట్ర ప్రభుత్వం సడలింపు ఇవ్వనుంది. మహిళా సంఘాల సభ్యుల

మిగతా 8వ పేజీలో...

ఆరు నెలలు దాటితే రుణం

సంఘంగా ఏర్పడిన గ్రూప్‌లోని సభ్యులు ఒక్కొక్కరు నెలకు రూ.50 నుంచి రూ.150 వరకు పొదుపు చేస్తారు. సక్రమంగా పొదుపు, సమావేశాలు ఉన్న సంఘాలకు ఆరు నెలలు దాటిన తర్వాత వారికి రూ.5 లక్షల రుణాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. ఈ రుణాన్ని సకాలంలో చెల్లిస్తే రుణాన్ని మరింత పెంచుతారు. మహిళలను ఆర్థిక స్వావలంబనగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరుపేద మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, బ్యాంక్ లింక్, స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా ఆదాయ వనరులు కల్పించడం కోసం మెప్మా, సెర్ప్ పరిధిలోని సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు.

సమాచారం

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి
దరఖాస్తుల ఆహ్వానం



మేడ్చల్ ప్రతినిధి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థుల నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను పంపాలన్నారు.

డ్రైవింగ్‌లో బీసీ యువతకు
ఉచిత శిక్షణ

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణి తెలిపారు. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట్, హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నారని ఆమె వెల్లడించారు. శిక్షణ వ్యవధి 38 రోజులు ఉంటుందని, అభ్యర్థులకు ఉచిత భోజన వసతి ఉంటుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు లైసెన్స్ ఉచితంగా అందజేస్తారని తెలిపారు. 31వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

పైరవీలు లేవు.. అర్హులకే ఇళ్లు

- ఐదేళ్ల ప్రణాళికతో సమగ్రాభివృద్ధి
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పైరవీలకు తావులేదని, అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణం ఎస్వీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత ఇందిరమ్మ కమిటీలదేనన్నారు. ఆర్థికభారం ఉన్నా రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అన్నారు. రెండేళ్లలో తాండూరులో రోడ్ల సమస్య ఉండదని చెప్పారు. చిలుక వాగు, గొల్ల చెరువు, ప్రక్షాళన పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు రమేశ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీలాలా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జర్న నాగప్ప, ఉత్తం చంద్, అబ్దుల్ రవూఫ్, గాజుల మాధవి, శోభ రాణి పాల్గొన్నారు.


హాజరైన ఇందిరమ్మ కమిటీ సభ్యులు



అప్రమత్తతే
శ్రీరామరక్ష

క్షయతో తస్మాత్ జాగ్రత్త
లక్షణాలు కన్పిస్తే పరీక్షలు తప్పనిసరి
నేడు అంతర్జాతీయ టీబీ నివారణ దినోత్సవం
7

యాదవులు పోరాటానికి
సిద్ధమవ్వాలి

యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య
6

అకాల వర్షంతో ఆగమాగం

- వడగండ్లకు దెబ్బతిన్న ఉల్లి, మొక్కజొన్న పంటలు
- జిల్లా వ్యాప్తంగా 500 ఎకరాల్లో నష్టం
- లబోదిబోమంటున్న రైతులు


మోత్కుపల్లిలో నేలకొరిగిన జొన్న పంట


అల్లిఖాన్‌పల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

వికారాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అకాల వర్షాలతో అన్నదాతలకు కడగండ్లు తప్పడం లేదు. మూడు రోజులుగా కురిసిన భారీ ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో వికారాబాద్ జిల్లాలో మర్పల్లి, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, కోట్‌పల్లి, పూడూరు తదితర మండలాల్లో జొన్న, మొక్కజొన్న, టమాట, ఉల్లి, కూరగాయలు, ఆకుకూరల పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 500 ఎకరాల వరకు పంటలు నేలకొరిగినట్లు తెలుస్తోంది. ఒక్క మర్పల్లి మండలంలోనే 200 ఎకరాల వరకు, నవాబ్‌పేట మండలంలో 100 ఎకరాల వరకు జొన్న, మొక్కజొన్న, ఉల్లి, కూరగాయ పంటలకు నష్టం జరగగా, మోమిన్‌పేట మండలంలో ఈ పంటలతో పాటు వరి పంటకు 100 ఎకరాల్లో నష్టం చేకూరినట్లు తెలుస్తోంది. ఆదివారం కురిసిన వడగండ్ల వర్షానికి జిల్లా వ్యాప్తంగా 100 ఎకరాల వరకు పంటలకు నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తుండగా, 3.70 హెక్టార్లలో ఉల్లి, టమాట పంటలకు నష్టం జరిగినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, ఈనెల 21వ తేదీన కురిసిన వర్షానికి పూడూరు మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 82 ఎకరాల్లో మొక్కజొన్న, 3.1 ఎకరాల్లో టమాట పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు.


వర్షంతో చెల్లాచెదురైన టమాట పంట



పిడుగుపాటుకు గేదె మృతి

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లిలో ఆదివారం పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందింది. రైతు కృష్ణయ్య పొలంలో గేదె మేత మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. ఆ గేదె విలువ దాదాపు రూ.1.30లక్షలు ఉంటుందని ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

గడువు వారం రోజులే!

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు ముందుకురాని దరఖాస్తుదారులు

31వ తేదీ వరకే ఫీజులో రాయితీకి అవకాశం

ఇప్పటివరకు కనీసం పది శాతానికి చేరని చెల్లింపులు

అధికారులు విస్తృత ప్రచారం కల్పిస్తున్నా అదే పరిస్థితి

యాప్‌లో సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

గడువు పొడిగించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

మేడ్చల్ జిల్లాలో 1,55,373 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు



మేడ్చల్ ప్రతినిధి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండటంతో అధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం చేపడుతున్నారు. అయినా అదే పరిస్థితి. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు కనీసం పది శాతం మంది దరఖాస్తుదారులు కూడా ఫీజు చెల్లించలేదు. దీనికితోడు ఎల్‌ఆర్‌ఎస్ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ప్రక్రియ ప్రభుత్వ ఉద్దేశం మేరకు ముందుకుసాగడం లేదు.

1,448 దరఖాస్తుల తిరస్కరణ

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,55,373 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 85,506 దరఖాస్తులను అధికారులు ఆమోదించగా 1,448 దరఖాస్తులను తిరస్కరించారు. 25,715 దరఖాస్తులు పీవోబీలో ఉండగా, ఎల్-1లో 27,708, ఎల్-2లో 2,353, ఎల్-3లో 3,375 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, 85,506 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు అధికారులు ఆమోదించారు. కానీ ఇప్పటివరకు పది శాతం మేర కూడా ఫీజు చెల్లించలేదు. కేవలం 6వేలకు పైగా మాత్రమే దరఖాస్తుదారులు ఇప్పటి వరకు ఫీజు చెల్లించారు. సుమారు 79 వేలకు పైగా

మిగతా 8వ పేజీలో...

సద్వినియోగం చేసుకోవాలి



స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ప్రతీ రోజు ఐదారు వందల మంది ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఈ నెలాఖారులోపు ఫీజులు చెల్లించి ప్రభుత్వం ఇచ్చే రాయితీని పొంది తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి.

-గౌతమ్, కలెక్టర్, మేడ్చల్

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

కీసర, మార్చి23(ఆంధ్రజ్యోతి): రంజాన్ మత సామరస్యానికి ప్రతీకని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఆదివారం కీసరలో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఈటల రాజేందర్, వజ్రేశ్ యాదవ్‌లు ఇద్దరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసంలో ఎంతో పవిత్రంగా, భక్తి, శ్రద్ధలతో ఉపావాస దీక్షలు చేపడుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, రవీందర్, సత్తిరెడ్డి, హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ముజీబ్, బీజేపీ నాయకులు తిరుమల్‌రెడ్డి, సుధాకర్, మెట్టు కృష్ణ, నల్లా వెంకట్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు జూపల్లి సాయిలు, రెడ్డబోయిన ప్రవీణ్, పోచబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎంపీ ఈటల, వజ్రేశ్‌యాదవ్

'లక్ష్మీదేవిపల్లి'పై గళం వినిపిస్తాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నాడు ప్రతిపక్ష హోదాలో.. నేడు అధికార పక్షంలో ఉంటూ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై అనునిత్యం గళం వినిపిస్తున్నానని, ప్రజాపాలనలో రిజర్వాయర్ నిర్మించి తీరుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భారీగా నిధులు మంజూరైన నేపథ్యంలో కాంగ్రెస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు ఆధ్వర్యంలో లాల్‌పహాడ్ చౌరస్తాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినంధన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే రిజర్వాయర్ నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడం సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. అందరి సహకారంతో రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. కొందుర్గు ఉమ్మడ మండలాభివృద్ధికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రజిత, సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, గోపాల్, శివ, గోపాల్‌రెడ్డి, యాదయ్య, మల్లేష్ గౌడ్, రాంచంద్రయ్య, ఏజాజ్, చంద్రబాబు, అజ్జు, రాజేష్, చందు, నరేందర్ పాల్గొన్నారు.

ఉగాది నుంచి సన్నబియ్యం

నందిగామ: ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చలివేంద్రగూడలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.7 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహులు, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, రాజగోపాల్, చంద్రపాల్‌రెడ్డి, ఎనుగొండ రమేశ్, మహేందర్, జ్ఞానేశ్వర్, నవాపేట్ రవీందర్‌గౌడ్, హనుమంతు, రాజునాయక్, రూప్‌సింగ్, శ్రీనునాయక్, శేఖర్, సుధాకర్, కిరణ్, రవి పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

శామీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ శాసన సభ, మండలిలో ఆమోదం పొందిన సందర్భంగా తూంకుంట నుంచి శామీర్‌పేట రింగు రోడ్డు వరకు భారీఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్, శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమిపూజ

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, కందుకూరు మాజీ ఉపసర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గాదె కుమార్ భూమిపూజ చేశారు. ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించిందని తెలిపారు.

యాదవులు పోరాటానికి సిద్ధమవ్వాలి

యాదవ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్యయాదవ్

దుద్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యాదవులు కలిసికట్టుగా ఉంటూ జనాభా దామాషా ప్రకారం తమ వాటా కోసం పోరాటానికి సిద్ధం కావాలని యాదవ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా మహేశ్, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా రమేశ్, శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణయ్య, సలహాదారురులుగా భాస్కర్, శ్రీనివాస్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాఘవేందర్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, యాదగిరి, పటేల్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులు నర్సిములుయాదవ్, ప్రభాకర్‌యాదవ్, అనంతయ్య యాదవ్, కోశాధికారి హన్మంతుయాదవ్, కిష్టప్ప యాదవ్, రమేశ్‌యాదవ్, హన్మంతుయాదవ్, బాల్‌రాజ్‌యాదవ్, నర్సింహులుయాదవ్, అంజనేయులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులివ్వాలి

ఆమనగల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని శాలి సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ఆదివారం ఆమనగల్లు భక్తమార్కేండేయ దేవస్థానం కమిటీ, పద్మశాలి సంఘం నాయకులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు అప్పం శ్రీనుల ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి రేవంత్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమనగల్లు భక్త మార్కండేయ దేవాలయం వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వపరంగా రూ.2కోట్ల నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో పేద విద్యార్థులకు వసతి, వృద్ధాశ్రమం నిర్మాణాలకు ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని సీఎంను కోరారు. అందుకు రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ, అప్పం శ్రీనులు తెలిపారు. సీఎం కలిసిన వారిలో పద్మశాలి సంఘం నాయకులు ఎంగలి యాదగిరి, మసున మురళీధర్ తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కనుల పండువగా మల్లన్న కల్యాణం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌సింగారంలోని ఆలయంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి భ్రమరాంబిక దేవిల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఒగ్గు కళాకారులు కల్యాణ తంతు జరిపించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు, జెడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి దంపతులు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాదవసంఘం కమిటీ సభ్యులు, ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, బద్దం కుమార్, కీసరగుట్ట ఆలయ కమిటీ సభ్యుడు పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్, మోహన్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకాలనీలో..

శంషాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ తంతుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



ఘట్‌కేసర్ రూరల్: ఒడిబియ్యం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు

» మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలం లేదనే విషయం ఎంత నిజమో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదనేది కూడా అంతే నిజమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉండాలన్నారు. 15 నెలల ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసింది ఏమీ లేదని, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడమే కాంగ్రెస్ చేసిన అభివృద్ధి అని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక అభివృద్ధి ఎక్కడికక్కడే ఆగిపోయిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని ప్రభుత్వం మరో నాలుగేండ్లు ఎలా పాలిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, దయ్యాల శ్రీను, బండ నర్సింహ, శ్రీకాంత్, యాదయ్య, కృష్ణ ఉన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

హైవేను విస్తరించాలని వినతి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

కడ్తాల్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి కోరారు. ఈమేరకు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. హైవేపై వాహనాల రద్దీ పెరిగి, తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రద్దీకి అనుగుణంగా రహదారిని విస్తరించాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు డీపీఆర్ పూర్తయిందని, వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణకు టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఎస్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు మన్యనాయక్, నాయకులు లక్ష్మణ్, మల్లేశ్, వెంకటేశ్ ఉన్నారు.



బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

శామీర్‌పేటలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

శామీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలో మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ సమావేశానికి కేటీఆర్ హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్న క్రమంలో రాజీవ్ రహదారిలో శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ వద్ద ఆగారు. ఉదయం నుంచి ఆయన రాక కోసం ఎదురుచూస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను చూసి ఆగి అభివాదం చేశారు. అనంతరం అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లారు.



పన్ను వసూలు చేస్తున్న అధికారులు

పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు

తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బృందాలుగా ఏర్పడి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు మున్సిపల్ యంత్రాగం రంగంలోకి దిగింది. తాండూరు మున్సిపాలిటీ జీఎస్‌డీపీ చేరుకోవాలంటే రూ.కోటీ 30లక్షలు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఎనిమిది రోజులు మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మేనేజర్ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రమేష్‌లు బృందంగా ఏర్పడి మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి బకాయిలను వివరిస్తూ ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. వీరితోపాటు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ కుమార్ ఆధ్వర్యంలో జవాన్లు బృందంగా ఏర్పడి ఆస్తి పన్ను వసూళ్లు చేపట్టారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

» క్షయతో తస్మాత్ జాగ్రత్త
» లక్షణాలు కన్పిస్తే పరీక్షలు తప్పనిసరి
» రోగ నివారణకు కొత్త ఔషధం
» టీబీకి అనంతగిరిలో ప్రత్యేక ఆస్పత్రి



తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సంక్రమిత వ్యాధుల్లో క్షయ ఒకటి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలను కూడా హరించేస్తుంది. మైక్రో బ్యాక్టీరియా అనే క్రిమి వల్ల ట్యూబర్‌క్యూలోసిస్(క్షయ) వ్యాపిస్తుంది. ఇప్పటికీ ప్రతి లక్ష మందిలో 206 మంది దీని బారిన పడుతున్నారు. క్రమం తప్పకుండా ఆరు నెలలు ముందులు వాడితే బయట పడే అవకాశాలున్నాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకొని చికిత్స చేయించుకోవాలి. లేదంటే..

క్షయను నాలుగు కేటగిరీలుగా విభజించారు. మొదటిసారి సోకితే కేటగిరి -1గా భావిస్తారు. వీరికి ఆరు నెలల పాటు మందులు అందిస్తారు. పాత వారికి మళ్లీ టీబీ సోకినట్టు గుర్తిస్తే వారిని కేటగీరి - 2గా గుర్తించి 8 నెలలపాటు మందులు అందిస్తారు. ఇక కేటగిరి -3 బారినపడే వారిని మొండి క్షయ వ్యాధి గ్రస్తులు(ఎండిఆర్) అంటారు. కేటగిరి - 4ను ముదిరిపోయిన వ్యాధిగ్రస్తులు(ఎక్స్‌డీఆర్)గా పరిగణిస్తారు. వీరికి తొమ్మిది నెలల నుంచి 24 నెలల పాటు మందులు అందిస్తారు. 24 నెలలపాటు మందులు వాడాల్సిన వారిని త్రీవమైన కేసులుగా పరిగణిస్తారు. వీరికి ప్రభుత్వం మందులను ఉచితంగా ఇస్తూ కొలుకునే వరకు వైద్య సేవలు అందిస్తుంది.

దగ్గు ద్వారా వ్యాప్తి

క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇంట్లో టీబీతో బాధపడే వారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే రోగులు, చిన్నారులను బాధితులకు దూరంగా ఉంచడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించే క్షేత్ర స్థాయి ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లకు, ప్రైవేటు వైద్యులు గుర్తిస్తే వారికి సైతం ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తోంది. వ్యాధితో బాధపడే రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున అందిసున్నారు.



నేడు అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవం

వ్యాధి లక్షణాలు

టీబీకి గురి చేసే వైరస్ ఊపిరితిత్తుల్లో నివసిస్తుంది. పోషకాహార లోపంతో బాధపడే వారికి, వెంటిలేషన్ సరిగాలేని ఇళ్లల్లో ఉండే వారికి, దీర్ఘకాళిక వ్యాధులతో బాధపడే వారికి, షుగర్, హెచ్‌ఐవీ బాధితులకు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి బారినపడిన వారిలో ఎడతెరిపి లేని దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, సాయంత్రం వేళ జ్వరం రావడం, నీరసం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, ఆయాసం అధికంగా ఉండడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. వీరికి మైక్రోస్కోపి, ఆర్‌పీసీఆర్, సీబీ నాట్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.

టీబీకి ఔషధ'గిరి'

టీబీ నివారణలో అనంతగిరి కొండలకు ఓ ప్రత్యేకత ఉంది. పలు రకాల మొక్కల్లో వ్యాధిని నయం చేసే గుణాలు ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా టీబీ ఆస్పత్రి కొనసాగుతుంది. ఏళ్ల చరిత్ర ఉన్న ఈ దవాఖానకు తెలంగాణ నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి టీబీ వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. చికిత్స పొంది బయటపడుతున్నారు.

టీబీ నియంత్రణకు 6 హెచ్‌పీ

తాండూరు జిల్లా ఆస్పత్రిలోని ఆర్ట్ సెంటర్‌లో టీబీ నివారణకు 6 హెచ్‌పీ ఔషధాన్ని ఆవిష్కరించారు. టీబీ నియంత్రణను ఆరు నెలల నుంచి 28 రోజులకు కుదించారు. 6 హెచ్‌పీ (600ఎంజీ) వాడితే ఇక టీబీ సోకదు. దీంతో వ్యాధిగ్రస్తులు భయపబాల్సిన అవసరం లేదు. హెచ్‌ఐవి వ్యాధి గ్రస్థులకు టీబీ వ్యాధి సోకకుండా ఈ ఔషధాన్ని వాడితే ఆరోగ్యవంతులవుతారు. గతంలో ఆరు నెలల పాటు మందులు వాడాల్సి ఉండేది. నివారణకు మందు రావడం రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్షయపై అవగాహన ఉండాలి



టీబీపై అందరికీ అవగాహన ఉండాలి. అప్పుడే నియంత్రణ సాధ్యమవుతుంది. షుగర్ బాధితులు, వృద్ధులు, పొగతాగే అలవాటు ఉన్న వాళ్లు, గుట్కా, పాన్ తినేవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలోనూ ఈ పరీక్షలు చేస్తారు. అన్ని రకాల మందులు ఇస్తారు. వ్యాధి బారిన పడినవారు ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉంటుంది.

\- డాక్టర్ జయప్రసాద్



కొత్తగూడలో శ్రీపాతాళ త్రికోణ మహాసుందరి అమ్మవారు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడలోని శ్రీపాతాళ త్రికోణ మహాసుందరి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. 20 అడుగుల అమ్మవారి ద్విముఖ భారీ విగ్రహాన్ని ఆదివారం తెల్లవారుజామున వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త మాధవరెడ్డితోపాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. 100 అడుగుల ఎత్తుతో రాజగోపుర నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

ధారూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు ధర్నాకు వెళ్లకుండా ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఆశా వర్కర్ల ధర్నా ఉన్న నేపథ్యంలో కొంతమంది ఆశా వర్కర్లను పోలీసులు ఆదివారి రాత్రి ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రాత్రి పూట ఆరెస్టు చేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు.



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

ఆమనగల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించి ఆరోగ్య సమాజ నిర్మాణానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆహర పదార్థాలను కల్తీచేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు మండలంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పెంటతండాకు చెందిన జాటావత్ రవికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.18వేల చెక్కును ఆయన అందజేశారు. శంకర్‌నాయక్, రాములునాయక్, సురమళ్ల సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, సుమన్‌నాయక్, శేఖర్, సతీష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం శంషాబాద్‌కు వెళ్లి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానించి, శివాజీ ఫొటో ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెట్ల వెంకటేష్, కాసోజు శివ, మురళీధర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, కటికల రాజు, రాఘవేందర్, శ్రీనాథ్, రాజు, అజయ్, మనోహర్, కందివనం అజయ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణయాదవ్, కరుణారెడ్డి, మణిక్యరెడ్డి, ధనుష్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సందీప్‌గౌడ్, నాగరాజు తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్ అర్బన్: రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న షాద్‌నగర్ బీజేపీ యువ నాయకులు

కందుకూరు: మండలంలోని తిమ్మాపురం, బేగంపేట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిమ్మాపూం మాజీ సర్పంచ్ పున్న భిక్షపతి, నాయకులు రమేష్‌గౌడ్, గంగాపురం రాజేందర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ పర్వతాలు, అమరేందర్‌రెడ్డి, రమేశ్, నర్సింహాగౌడ్, సరికొండ వెంకటేశ్, పరమేశ్, శీనివాస్, రాజు, కుమార్, వెంకటేష్, నరేందర్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన



దుద్యాల: దుద్యాల గేటు సమీపంలో రోడ్డుపై పడిన చెట్టు

మోమిన్‌పేట్/నవాబుపేట/ధారూరు/మర్పల్లి/దుద్యాల/కోట్‌పల్లి/పరిగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ఉల్లి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పది రోజుల్లో చేతికొచ్చే ఉల్లి పంట వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ధారూరు మండల పరిధిలోని ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో వడగండ్ల వాన కురిసింది. దాదాపు అరగంట పాటు వర్షం కురవడంతో దుక్కుల్లో వడగండ్లు కుప్పలు, కుప్పలుగా కనిపించాయి.



ధారూరు: ధర్మాపూర్ శివారులోని పొలంలో కురుస్తున్న వడగండ్ల వాన

అధికారుల పరిశీలన

మోమిన్‌పేట్ మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎన్కతల, రాంనాథ్‌గూడుపల్లి, టేకులపల్లి, అమ్రాదికలాన్, అమ్రాదికుర్దు తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, ఉల్లి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. నవాబుపేట మండలంలోని అక్నాపూర్, నారేగూడ, దాదాపూర్, పులుమామిడి, చింతల్‌పేట్, చిట్టిగిద్ద తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జొన్న, టమాట, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. మర్పల్లి మండలంలోని బిల్కల్, కొంశెట్టిపల్లి, మల్లికార్జునగిరి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఏఈవో జ్యోతి తెలిపారు. ఆదివారం బిల్కల్, మల్లికార్జునగిరి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించి వివరాలను సేకరించారు.



మర్పల్లి: పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో జ్యోతి

తీరని నష్టం

కోట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గాలివాన, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లింది. మోత్కుపల్లి గ్రామంలో ఈడిగి మాణయ్య గౌడ్ ఎకరం పొలంలో జొన్న పంట నేలకొరిగింది. పూలు, జొన్న, ఉల్లి పంటలు పాడయ్యాయి.

పరిగి: పరిగిలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఒక్కసారి వాతావరణం చల్లబడింది. పరిగితోపాటు, రాఘవాపూర్, కాళ్యాపూర్,రంగాపూర్, పేటమాదారం గ్రామాల్లో వర్షంతోపాటు వడగళ్లు పడ్డాయి.



దుద్యాల సమీపంలో నేలకొరిగిన వేప చెట్టు

నేలకొరిగిన భారీ వృక్షాలు

దుద్యాల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఓ ఇంటి పైకప్పు గాలికి ఎగిరిపోయింది. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. అల్లిఖాన్‌పల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడింది. ఓ రైతు పొలంలో తుమ్మ చెట్టు వేర్లతో సహా కూలి పొలంలో పడింది. కోత దశకు వచ్చిన వరి పంటకు వడగండ్ల వర్షంతో నష్టం జరిగింది. అరగంట పాటు కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం దొరికింది.

మహిళా శక్తి.. మరింత బలోపేతం!

(ఐదో పేజీ తరువాయి)

విరమణ వయస్సును 60నుంచి 65ఏళ్లకు కొత్తగా సంఘంలో సభ్యులుగా చేరే వారికి ప్రస్తుతం 18ఏళ్ల అర్హత వస్తుండగా మూడేళ్లు తగిస్తూ 15 ఏళ్లుగా నిర్ణయించారు. ఇక నుంచి 15 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకు సంఘాల్లో సభ్యులుగా కొనసాగవచ్చును. రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయం పట్ల మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వృద్ధులకు ప్రత్యేక సంఘాలు

60 నుంచి 65 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు ప్రత్యేకంగా 'వృద్ధుల స్వయం సహాయక సంఘాలు' (ఈఎస్‌హెచ్‌జీఎస్) ఏర్పాటుకు అవకాశం కల్పించనున్నారు. ఈగ్రూప్‌ల ద్వారా వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ, బీమా సౌకర్యం, చట్టపరమైన హక్కులు, ఆర్థిక సాయం అందించనున్నారు.

కిశోర బాలికలకూ ప్రత్యేకం

15-18ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలికలను 'కిశోర బాలికల సమూహాలు'గా ప్రత్యేకంగా గ్రూపులను ఏర్పాటు చేయనున్నారు. వీరికి నైపుణ్య అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉపాధి కల్పన, సామాజిక జాగృతిని పెంపొందించేలా ఈ సమూహాల సభ్యులను తీర్చిదిద్దుతారు. యుక్తవయస్సులోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాల్లో చేరేందుకు వీలు కల్పిస్తారు.

ఇందిరమ్మ ఇళ్లకు స్థలాల సమస్య

- స్థలాలు లేని వారే అధికం
- రెండు దశల్లో వడబోత
- సర్వేలో బయటపడిన అనర్హులు



తాండూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అధిక శాతం దరఖాస్తులకు స్థలాలు లేవని సర్వేలో తేలింది. 95శాతం మంది సర్వే చేయించుకోగా అందులో 85శాతం మంది దరఖాస్తుదారులకు స్థలాల సమస్య ఉన్నట్లు అధికారులు సర్వేలో గుర్తించారు. పట్టణాల్లో దరఖాస్తు సమర్పించిన వారికి సమీపంలో నున్న గ్రామపంచాయతీ పరిధిలో ప్లాట్లుఉండడం, ఉమ్మడి కుటుంబంలో ప్లాట్లు ఉన్న సమస్యలుండడం వంటి సాంకేతిక కారణాలున్నాయి. స్థలమున్న దరఖాస్తుదారులకే ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు మొదటి ప్రాధాన్యతనని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం విదితమే. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రక్రియ రెండో దశ ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశముంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను చేపడుతున్నట్లు సమాచారం.

తాండూరు డివిజన్‌లో...

తాండూరు డివిజన్ పరిధిలో రెండు మున్సిపాలిటీలు, ఏడు మండలాలున్నాయి. 1,10,017 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు సమర్పించగా 99,347 మంది దరఖాస్తుల ఈయాప్ సర్వే ద్వారా పరిశీలన పూర్తయింది. ఇదిలా ఉండగా మండలానికి ఒకటి చొప్పున మండల కేంద్రాల్లో మోడల్ ఇందిరమ్మ గృహాల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. మోడల్ గృహాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాల్లో శ్రీకారం చుట్టారు.

అనర్హుల గుర్తింపు

యాప్ ద్వారా చేపట్టిన సర్వేలో అనర్హులు కూడా బయటపడ్డారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారు, ఉద్యోగులు, పాత ఇళ్లు ఉన్న వాళ్లు, వ్యాపారులు, ఆర్థికంగా ఉన్న వారు, పట్టణాల్లో దరఖాస్తు సమయానికి ఇళ్లు లేకున్న వారు తర్వాత క్రమంలో ఇళ్లు కొనుగోలు చేయడం వంటి వాటితో వివరాలతో అనర్హులుగా తేలిపోయారు. తాండూరు ప్రాంతంలో అధికంగా షాబాద్ బండలు కప్పిన ఇళ్లు ఉండటంతో వారిని కూడా ఇందిరమ్మ ఇళ్ల అర్హులుగా గుర్తించారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

కోట్‌పల్లి మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన బోయిని అశోక్(33) ఇంట్లో ఎవరూలేని సమయంలో శనివారం రాత్రి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ గఫర్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



నర్సింహులు మృతదేహం

పరిగి, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): చెరువులో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారుడు చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహింపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన రాఘపురం నర్సింహులు(35) శనివారం సాయంత్రం గ్రామశివారులోని చెరువులోకి చేపలవేటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం గ్రామ సమీపంలోని చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. నర్సింహులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మత్స్యకారుడికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుడికి భార్య సరిత, ఐదేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో జింక మృత్యువాత



దోమ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి చెరువులో నీరు తాగేందుకు వెళ్లిన జింకపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై మృత్యువాతపడింది. ఈ విషయం చెరువు సమీపంలోని పొలాల రైతులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాలైన జింకను ఫారెస్టు అధికారి ఓమి దోమ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృత్యువాతపడినట్లు వైద్యులు తెలిపారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



వికారాబాద్: భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు



తాండూరు: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు



కొడంగల్: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వికారాబాద్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్నతనం నుంచే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, యువతకు లౌకిక భావాలతో ఐక్యత పాఠాలు నేర్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు తేజ, సిద్ధు, రెహాన్ పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ కార్యకర్తలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నవీన్‌కుమార్, జోగు లాలయ్య, శ్రీనివాస్, మాణిక్యం, శంకర్ పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలోని సీతారాంపేట్‌లో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య, రవి, నరేష్, బాలరామ్, రాజు, నర్సింహులు, రఘుపతి, రాజు, నరేష్ పాల్గొన్నారు.

కొడంగల్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు ఎండీ.మైమూద్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్, నాయకులు మూతుల రాజు, మల్లప్ప పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కేసారంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మహేందర్, స్టాలిన్, ఆనంద్‌కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

దుద్యాల: భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లప్ప, చెన్నయ్య, రాములుగౌడ్, శ్రీశైలం, అశోక్, మొగులయ్య, అనిల్, మల్లయ్య పాల్గొన్నారు.

దోమ: మహనీయుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీపీఎం మండల నాయకులు సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురామ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, మొగులయ్య, మనోజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా సీపీఎం పరిగి డివిజన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కొడంగల్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. బస్టాండ్ దగ్గర భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యులు ఆర్.వెంకట్‌రాములు, ఎం.వెంకటయ్య, బస్సు చంద్రయ్య, నాయకులు ఎండి హబీబ్, సత్యయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం, శేఖర్, అనిల్ పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆదివారం పరిగిలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సరిత, పద్మమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఆర్జీకే కాలనీలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి చిత్రపటాలకు మేడ్చల్ జిల్లా సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు చింతల యాదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సబిత, పోచయ్య, సునీత, అనిల్, శ్రీనువాస్, అర్చన, సంజన, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గడువు వారం రోజులే!

(ఐదో పేజీ తరువాయి)

దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాల్సి ఉంది. 31వ తేదీ వరకు మాత్రమే ఫీజు చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇవ్వనుంది. ఇందుకు మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఏ మేరకు దరఖాస్తుదారులు ఫీజు చెల్లిస్తారో వేచి చూడాల్సింది.

తరచూ మొరాయిస్తున్న యాప్

ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ యాప్ తరుచూ మొరాయిస్తుండటంతో అధికారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ యాప్ ఓపెన్ కూడా కాని పరిస్థితి. దీనికితోడు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినవారికి చలానాలు రావడం లేదు. స్థలాలు క్రమబద్ధీకరించుకోవాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు విస్తృత ప్రచారం చేపడుతున్నా దరఖాస్తుదారులు ముందుకు రాని పరిస్థితి.

గాడిన పడుతున్న ప్రక్రియ

కాగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపుపై 25 శాతం రాయితీ గడువును పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పుడిప్పుడే ఈ ప్రక్రియ గాడిన పడుతుండటంతో మరో నెల రోజుల పాటు రాయితీ గడువును పెంచే యోచనలో ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

ఎమ్మెల్సీని కలిసిన మాల మహానాడు నాయకులు



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను మేడ్చల్ నియోజకవర్గ మాల మహానాడు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని అద్దంకి దయాకర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు, నియోజకవర్గ నాయకులు వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు ధారూరులో రైతు సదస్సు

ధారూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో నేడు(సోమవారం) రైతు సదస్సు నిర్వహిస్తున్నారు. ధారూరు రైతువేదికలో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. యాసంగి, ఎండాకాలం పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, కోతులు, అడవి పందుల యాజమాన్యంపై కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

మంత్రి చేతుల మీదుగా పంచాంగం ఆవిష్కరణ

కొడంగల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్‌లో దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పంచాంగ ఆవిష్కరణకు జిల్లా అధ్యక్షుడు జయతీర్థచారి ఆధ్వర్యంలో అర్చకుల బృందం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కిట్టుస్వామి, విజయకృష్ణ జ్యోషి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణ హోమం



తాండూరులో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పారాయణ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిపుత్ర హోమ్ అండ్ డెవలపర్ నేత బావనోళ్ల శంకర్ యాదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ గీతసత్సంగ్ సేవా సమితి ప్రతినిధులు, ఆమనగల్ల శ్రీరామదూత ఆశ్రమం శ్రీత్యశుద్ధానంద స్వామి, క్షేత్ర సంస్థాపకులు శివానంద స్వామి పాల్గొన్నారు.

- తాండూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

అ'పూర్వ' సమ్మేళనం



మోమిన్‌పేట్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పరిగి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 22ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్న వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విద్యను బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోధించిన గురువులు రత్నాకరం, సుదర్శన్‌రెడ్డి, ఆర్.వెంకట్‌రాంలు, నర్సింహులు, వెంకటేశం, బాలరాజు, స్థానిక పాఠశాల హెచ్ఎం మల్లేశంలు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని టేకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 22 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో అప్పటి మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. వారి ఉపాధ్యాయులు నాగిరెడ్డి, కృష్ణయ్య ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు బ్రహ్మంచారి, వెంకటిరెడ్డి, వెంకటయ్య, రత్నం, ప్రకాశం, మాణిక్యాలరావు, శ్రీనివాస్‌జోషి, లీలావాణి, పూర్వ విద్యార్థులు అస్లాం పాల్గొన్నారు.

శామీర్‌పేట: అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2004- 05 బ్యాచ్‌కు చెందిన టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని తూంకుంట సమ్మర్‌గ్రీన్ రిసార్ట్‌లో సమ్మేళనాన్ని జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రసన్నలక్ష్మి, ప్రసన్నదేవి, మల్లేశ్, జయలక్ష్మి పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



తాండూరు: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. చెనెగేష్‌పూర్ రోడ్డులోని క్లాసిక్‌గార్డెన్‌లో ఈ విందును ఏర్పాటు చేశారు. జిల్లాలోనే అత్యధికంగా మైనార్టీలు తాండూరులో ఉన్నారని వారికి కావాల్సిన వసతులు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మైనార్టీ నాయకులు అబ్దుల్ రవూఫ్, సర్దార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పరిగి: హిందూ ముస్లింలు పండుగలను సోదర భావంతో జరుపుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలు అన్నారు. పరిగిలోని శారద గార్డెన్‌లో ఆదివారం రాత్రి రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం మతసామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి డీయస్సీ శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ

మేడ్చల్ టౌన్: రంజాన్ పండుగ వేడుకలను పురస్కరించుకుని మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ నాయకుడు రామన్న గారి రామచేందర్‌గౌడ్ ఆదివారం 300మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. పండుగ వంటకాలకు సరిపడా సరుకులతో పాటు రూ.500 నగదును నిరుపేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు సయ్యద్ ఇనాయత్ పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు దుస్తులు అందజేత

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ఆదివారం జామే మస్జీద్‌లో రంజాన్ పండగను పురస్కరించుకొని ఇమామ్, మౌజన్‌లకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ మిత్ర మండలి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసిఫ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు వీరన్న, దస్తప్ప, కృష్ణ, పకీరప్ప పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



పాఠశాల వార్షికోత్సవంలో ముద్దప్పదేశ్‌ముఖ్

కొడంగల్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, న్యాయవాది బస్వరాజ్, ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి మోహన్, కృష్ణగౌడ్ అన్నారు. స్థానిక శ్రీ నేతాజీ విద్యాభవన్‌లో శనివారం రాత్రి జరిగిన పాఠశాల వార్షికోత్సవానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మణిమాలరెడ్డి, కరస్పాండెంట్ అభిలాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వంశీ పాల్గొన్నారు.


పరీక్షకు సిద్ధమవ్వాలి



సరళ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న హిందూ ధార్మిక పరిషత్ ప్రతినిధులు

తాండూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సాధనచేసి సిద్ధమవ్వాలని ఆర్‌బీవోఎల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణం భాష్యం కళాశాలలో హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ ప్రతినిధులు గాజుల బస్వరాజ్, నరేందర్ పాల్గొన్నారు.

ప్రశాంత జీవనానికి యోగా దోహదం



యోగా సాధనలో సీనియర్ సిటిజన్లు

మేడ్చల్ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన వారందరూ ప్రశాంత జీవనం గడపాలనుకుంటే వారు యోగా దోహదపడుతుందని సాకేత్ ప్రణామం రెసిడెన్స్ అధ్యక్షుడు ఎంవీ.శేషయ్య అన్నారు. ఆధ్యాత్మిక సద్గురువు మాతాజీ నిర్మలాదేవి 102జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సాకేత్ ప్రణామం ఆవరణలో యోగ సాధన పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్‌పి నారాయణరావు, డాక్టర్ రాకేష్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

పరిగి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఉత్సవాలు దేవాదాయ శాఖ పరిధిలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి ఆదివారం అమ్మవారి ఓడిబియ్యం, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి దంపతులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్ కృష్ణ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.

ఎబ్బనూర్‌లో మల్లన్న స్వామి బోనాలు



ఎబ్బనూర్‌లో బోనాలతో మహిళల ఊరేగింపు

ధారూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎబ్బనూర్ గ్రామంలో ఆదివారం బీరప్ప జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు మల్లన్న స్వామికి దీప, దీప నైవేద్యం సమర్పించి అగ్నిగుండ తొక్కారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా మల్లన్న ఆలయానికి వెళ్లి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి బోనాలు సమర్పించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాల అమలు

బషీరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ శాంతి అన్నారు. మండల పరిధిలోని బోజ్యానాయక్‌తండాలో ఆదివారం నూతన రేషన్‌కార్డు దారులకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ రాము, నాయకులు ఏష్యానాయక్, మోత్యానాయక్, బాబ్యానాయక్, మాన్యనాయక్, రాంచందర్ పాల్గొన్నారు.